ఈ వారం కథ

అంటరాని ప్రేమ



కెమెరా విజయ్ కుమార్

"మీ అటెండరు ఆఫీసు నుంచి తీసుకొచ్చిన ఉత్తరాలు టేబులు మీద పెట్టాను. అవి చూస్తూ వుండండి. ఈ లోపుగా మీ స్నానానికి నీళ్ళు పెడతాను" టూర్ నుంచి వచ్చిన నాతో చెప్పి లోపలికి వెళ్ళింది నా శ్రీమతి.

బట్టలు మార్చుకుని రిలాక్సయి ఉత్తరాలు చూడడం మొదలు పెట్టాను. దాదాపు అన్నీ వార్డెన్లు, మేట్రెన్లు పంపిన రిపోర్టులే. సోషల్ వెల్‌ఫేర్ ఆఫీసరయిన మొదట్లో ఆ నివేదికలన్నీ ఆసక్తిగా చదివేవాణ్ణి. తర్వాత్తర్వాత అందులో సగానికి సగం అబద్ధాలని తెలిసి యాంత్రికంగా ఫైల్ చేస్తుంటాను.

ఇంగ్లీషులో రాసిన అన్ని ఉత్తరాల మధ్య ఒక తెలుగు ఉత్తరం. కవరు మీద సైతం ఏసుదాసుగారు అన్న తెలుగు అక్షరాలు... కాస్త వంకర టింకరగా... ఆ వంకర్లలో పదేళ్ళ స్నేహం వుంది. రాసింది తనకెంతో ఆప్తుడు వెంకన్న. వచ్చింది ఆత్రేయపురం నుంచి.

వెంకన్న ఎప్పుడోగాని ఉత్తరం రాయడు. ఆ ఉత్తరాన్ని ఒకటికి రెండుసార్లు చదివి అర్థం చేసుకున్నాను.

"నీళ్ళు చల్లారిపోతున్నాయి. ఏం చేస్తున్నారు?" రెండవసారి లోపలి నుంచి కేక సాదరంగానే వినిపించింది. నిజానికి ముచ్చెమటలు పోసి అప్పటికే ఒళ్ళు చల్లబడింది.

స్నాన పానాదులు యాంత్రికంగా జరిగిపోయాయి. బయట పడక కుర్చీలో కూచున్నాను. ఆత్రేయపురంలో జరిగిన సంఘటనలు నా కళ్ళ ముందు కదలాడాయి.

* * *

మొదటిసారి ఆత్రేయపురం వెళ్ళింది ఉద్యోగ రీత్యా. బదిలీ ఆర్డరు పుచ్చుకొని చిన్న పిల్లాడిలా ఆనందం ఉప్పొంగి రాగా నిండుగా ప్రవహించే గోదావరి కాలవల్నీ, పచ్చని కొబ్బరి చెట్లని ఊహించుకుంటూ వెళ్ళాను.

కొత్తగా పెళ్ళయి వుండడం వల్ల మంచి ఇల్లు దొరికితే భార్యను తీసుకొచ్చి కాపురం పెట్టాలని అద్దె ఇంటి కోసం ఊళ్ళోకి వెళ్ళాను.

ఊళ్ళో మంచి ఇళ్ళే కనిపించాయి. అక్కడ మా కోసం ఓ మంచి ఇల్లు దొరక్కపోద్దా అని నమ్మకంతోనే అడిగాను.

ఎక్కడ ఏ యింటి వద్ద అడిగినా ఒకే ప్రశ్న... 'ఎవరండి మీరు' అని. నేను కాస్త సందిగ్ధంలో పడేసరికి వాళ్ళే కాస్త విపులంగా.... 'మీ కులం ఏమిటండీ?' అని అడిగేరు.

నన్ను ఎవరైనా కులం పేరుతో ప్రశ్నిస్తే సహించలేను. దానికి కారణాల్ని ఏవైనా కాని... అది అనాగరికంగానే జమకడతాను. అయినా నాకిప్పుడొక మంచి ఇల్లు కావాలి. అందుకని 'క్రిస్టియన్ని' అన్నాను.

'అంటే మీరు పంచములా?' అని వాళ్లే తేల్చుకుని ముఖం మీదే తలుపులు మూసేసుకున్నారు.

ఈ దేశంలో హాస్టలు వార్డెన్లు పేదవాళ్ళు కాకుంటే నేనూ పేదవాణ్ని కాదు. ఆ ఊళ్ళో నాలా మూడు ఎమ్మేలు చదివిన వాళ్ళు ఒక్కరూ లేరు. నేను ఒక్క చేత్తో సంపాదించినా ఎక్కువే వస్తుంది. అయినా ఇల్లు ఇవ్వడానికి యూనివర్శిటీలు ఇచ్చిన ఫస్ట్‌క్లాస్ డిగ్రీలు కానీ, సెక్యులర్ ప్రభుత్వం ముద్రించిన నోట్లు కానీ ఏమీ చేయలేకపోయాయి. అక్కడ 'మనీ' కూడా మనువును జయించలేకపోయింది. అక్కడ అన్ని అర్హతల్నీ మించిన అర్హత కులం.

నేను చేసేది లేక దగ్గర పట్టణం అయిన రాజమండ్రిలోనే కాపురం పెట్టి రోజూ మొదటి లాంచీకి వెళ్ళి చివరి లాంచీకి వచ్చేవాణ్ని. లాంచీలలో అంటరానివారికి వేరే బెంచీలు వేయకుండా అడ్డుకున్న క్యాపిటలిజానికి మనస్సులోనే ధన్యవాదాలర్పించేవాణ్ని.

పని ఎక్కువగా వున్న రోజుల్లోనూ, వర్షం వచ్చినప్పుడూ లాంచీలు లేక పడే ఇబ్బందులకు అంతుందేది కాదు. ఈ చికాకులు పడలేక మళ్ళా ఇంటి గురించి ఆలోచించాను. ఊరు కాదంటే వాడ కాదంటుందా? ఊరికి పక్కనే ఆనుకుని వున్న మాలపల్లెలో ఇల్లు చూసుకుని దిగిపోయాను.

ఆ ఇంటిలో దిగి రెండు నెలలు గడిచింది. ఒక రోజు సాయంత్రం ఇంటికొచ్చేసరికి కరెంటులేదు. డాబా పైకి వెళ్ళాను. వేసవి కాలం మూలాన ఆలస్యంగా పొద్దుకుంగడం మొదలైంది.

ఎదురుగుండా ఆకాశంలో మారుతున్న రంగుల చిత్రాన్ని చూడడం మొదలుపెట్టాను. ఒక వర్ణం మరొక వర్ణంతో కలసి ఎంతో ఆనందమయం చేస్తున్నాయి. ఆ అందమైన అనుభూతి అంతలోనే చెదరినట్లనిపించింది. ఈ సమాజంలో మాత్రం ఏ వర్ణం మరొక వర్ణంతో కలవకూడదు.

నేను డాబాపై అలానే నిల్చుని కుంగిపోతున్న సూర్యుణ్ణి చూస్తున్నాను. నిశ్శబ్దం నిండా ఆవరించుకొంది.

"ఎంకడూ... ఎంకడూ..." అంటూ ఎవరో పిలుస్తున్నారు. నేను కిందికి చూశాను. ప్రహరీ గేటు బయట నుంచి నలుగురు రైతు కూలీలు ఇంటి యజమానిని పిలుస్తున్నారు. వారి వేషధారణ పేదరికానికి గీటురాయిలా వుంది. గేటుకీ, డాబాకీ మధ్యనున్న రెండువరసల పొడగాటి కొబ్బరి చెట్ల మధ్యనుంచి వాళ్ళ ఎదగనితనం స్పష్టంగా కనపడుతుంది.

ఇంటి యజమాని గబగబా అడుగులేసుకుంటూ గేటు దిగి వెళ్ళి వాళ్ళ ముందు చేతులు కట్టుకొని నిలుచున్నాడు. నాకది విడ్డూరంగానూ, అసహజంగానూ అనిపించి ఎదురుగా జరుగుతున్న ఆ దృశ్యం మీద మనస్సును లగ్నం చేశాను.

"తోటంతా తవ్వే పాలికి నదుం ఇరిగిపోయిందిరా ఎంకా?" ఓ గుబురు మీసాల కూలి బొంగురు గొంతుకతో అన్నాడు.

"మెరక నేను మాటేం సెద్దాంరా?' తువ్వాలు దులుపుకుంటూ మరో కూలి అందుకున్నాడు.

'పొద్దు కుంగిపోతాంది, బేగి పంపిచేత్తావా మరి" గుబురు మీసాల ఆసామీ తొందరపెట్టాడు.

వెంకన్న గుడ్డ బనీను జేబులోంచి డబ్బులు తీసి గేటు అరుగు మీద పెట్టి "ఇందండి డబ్బులు" అన్నాడు. వెంకన్న అరుగు మీద పెట్టిన డబ్బులు తీసుకుని ఆ నలుగురు కూలీలు వెళ్ళిపోయారు.

"ఎవరండీ వాళ్ళు మీ చుట్టాలా?" డాబా మెట్లు దిగి వరండాలోకి వస్తూ వెంకన్నని అడిగాను.

"సుట్టాలా? భలేవోరే. ఆళ్ళు కులోళ్ళు. కూలి డబ్బుల కోసం వచ్చేరు" నవ్వేశాడు వెంకన్న.

నాకు మాట రాలేదు. అప్పటికే చీకటి పూర్తిగా కమ్మేసింది. "మీరు డబ్బులు అరుగు మీద పెట్టేరేమిటి?"

వెంకన్న ఓ క్షణం ఆగి 'ఆళ్ళు పెద్ద కులపోళ్లు గదండి మనం సేత్తో యిత్తే పుచ్చుకోరు"

వెంకన్న సమాధానం తుపాను కెరటం సడనను చాచి కొట్టినట్టు నా మనస్సుకు తగిలింది.

అప్పుడు నాకనిపించింది! ఈ దేశంలో స్వతంత్రం ఎవరికి వచ్చింది; డబ్బుకొచ్చిందని దబాయిస్తారు. కాని దానిక్కూడా పూర్తిగా రాలేదనిపిస్తుంది. ఎందుకంటే.. వెంకన్న పదెకరాల మాగాణి పొలం, అయిదెకరాల కొబ్బరి తోటకు ఆసామి. లక్షల ఖరీదు చేసే ఇల్లుంది. పైగా లాకుల దగ్గర కళాసీగా ఉద్యోగం వుంది.

ఇదంతా ఒక ఎత్తు, అతని పెద్దకొడుకు కువైట్ నుండి నెలకు కనీసం ఓ పదివేలు తక్కువ కాకుండా తండ్రికి పంపుతున్నాడు. కనుక వెంకన్న దరిద్రరేఖ దాటి చాలాదూరం పోయాడు

ఇప్పుడు వెంకన్న ఏ వర్గానికి చెందుతాడు? ఇలా నా ఆలోచనలు పరిపరివిధాల పోయాయి.

'యిక్కడిది మామూలే' నా ఆలోచనలకు చిన్న అడ్డుకట్ట వేశాడు వెంకన్న.

నా మనస్సులోని ఆవేదనకు బయట పెట్టేశాను. "ఇంత డబ్బున్న మిమ్మల్ని కూడా ఇంత తక్కువ చేసి ఎలా మాట్లాడుతున్నారు. చిన్నదో పెద్దదో గవర్నమెంటు ఉద్యోగం కూడా చేస్తున్నారు" అన్నాను.

"లాకుల కాడ కలాసి ఉజ్యోగం కూడా గొప్పదేనటండీ. ఇదయినా ఆ దొరల పున్నమేనండి. నా కట్టం వుంచుకోలేదాళ్ళు. ఎళ్ళిపోతూ నన్నిందులో పెట్టేరు. అసలు సిన్నప్పుడు పాలేరుగా ఈ ఊరి కామందుల కాడ చేసినోడినే కదండి! యీరి తన్నులకీ దెబ్బలకీ బయపడి దొర పంచన సేరాను. ఏదో ఈ కూడు దొరికిందీనాడు" అన్నాడు.

ఇంతలో వెంకన్న చిన్న కొడుకు రాజు అక్కడకొచ్చేడు. "మా నాన్న ఎప్పుడూ అంతేనండి. బస్సులో టికెట్టు తీసి ఎక్కి కూర్చుంటాడా- ఊళ్ళో వాళ్ళు ఎవరైనా కనపడితే చాలు లేచిపోతాడండి. నన్ను కూడా కూచోనివ్వడండి" అప్పటివరకు వరండాలో వుండి మా మాటలు వింటున్న రాజు అందుకున్నాడు.

"ఏదిశావ్!" అంటూ కొడుకును ఆప్యాయంగా వెంకన్న మందలించాడు. రాజు ఆ ఏడాదే పదవ తరగతి పాసై ఇంట్లో కూచున్నాడు.

ఈ సంఘటన నా కళ్ళని పూర్తిగా తెరిపించింది. వెంకన్నలో వున్న న్యూనతా భావం కన్నా, రాజులో వున్న నిర్లిప్తత కన్నా, పడగవిప్పి విషపు కోరలు చాచిన హైందవ నాగరాజు నన్ను కలచివేసింది.

ఆ సంవత్సరం ఇంకా కాలేజి అడ్మిషన్లు వున్నాయి. నేను రాజుని తీసుకెళ్ళి కాలేజీలో సైన్సు గ్రూపులో చేర్పించాను.

రెండు సంవత్సరాలు తెలియకుండానే గడిచాయి. ఈ రెండు సంవత్సరాలలో రాజును మంచి లెక్చరర్ల దగ్గర ట్యూషను ఇప్పించి ఇంటర్‌లో మంచి మార్కులు సంపాదించేటట్టు చేశాను.

మంచి మార్కుల్తో క్లాసులో పాసయ్యాడు. అందుకని యూనివర్శిటీకి తీసుకెళ్ళి కంప్యూటరు ఇంజనీరింగులో చేర్పించాను. మంచి తెలివైన చలాకీ కుర్రవాడు రాజు.

అదే సంవత్సరం నాకు ప్రమోషన్ రావడంతో మరో ఊరు వెళ్ళిపోవడం జరిగింది.

రాజు ఇంజనీరింగు కోర్సు పూర్తి చేశాక బెంగుళూరులోని జర్మన్ కొలాబరేషన్‌తో ప్రారంభించిన ఓ పెద్ద కంపెనీలో చేర్పించడం వరకు నా ఆధ్వర్యంలోనే జరిగింది.

రాజు ఉద్యోగంలో స్థిరపడ్డాడు.

ఇప్పుడు ఆ రాజును గురించి ఏదో మాట్లాడాలని, నేనే వచ్చిచెప్పాలని ఎప్పుడూ ఉత్తరం రాయని వెంకన్న నాకు రాశాడు. వెంటనే బయలుదేరి రమ్మని మరీ రాశాడు.

నేను ఆత్రేయపురం బయల్దేరాను.

నా రాక చూసి వెంకన్న గేటు దగ్గరికి ఎదురొచ్చి చేతిలో బ్రీఫ్‌కేసు అందుకున్నాడు.

"రాజేడి? ఊర్నించి వచ్చేశాడని రాశారు!" అంటుండగా ముఖం కడుక్కోవడానికి వెంకన్న నన్ను నూతి దగ్గరకు తీసుకెళ్ళేడు.

"మద్దేనం మీ దగ్గిరికే బయల్దేరాడు. అసలు ఇసయం ఏటంటేండి!" అంటూ రాజు రాక ముందే తాను అన్ని విషయాలు చెప్పేయాలన్న తొందర పడుతుండగా ఇంతలో

"ఎంకా... ఎంకా..." గేటు బయట నుంచి ఎవరో కీచుగా పిలుస్తున్నారు.

వెంకన్న కంగారుగా తువాలు భుజాన్నేసుకుని పరుగు లాంటి నడకతో వెళ్ళి గేటు బార్లా తెరిచాడు.

ఎదురుగా వెంకన్న పొలంలో పనిచేసే అగ్రకుల రైతు కూలి. గేటు దగ్గర నుంచి వెంకన్న చేయి పట్టుకొని కొంచెం దూరం తీసుకెళ్ళాడు.

ముఖం కడుక్కుని వరండాలోకి వచ్చి కూర్చున్న నాకు వాళ్ళిద్దరూ మాట్లాడుకోవడం కనిపిస్తుంది. దూరం అవడం వల్ల వాళ్ళు ఏం మాట్లాడుకుంటున్నారో వినపడడం లేదు. అంతా మూకీ సినిమాలాగుంది.

ఆ వచ్చిన కూలీ వెంకన్న రెండు చేతులు పట్టుకొని ఏదేదో చెప్తున్నాడు. వెంకన్న చేతులు విడిపించుకుంటూ జోడించి దండాలు పెడుతున్నాడు. ఆ కూలీ భుజం మీది తువ్వాలుతో కళ్ళు తుడుచుకుంటూ వెంకన్నను మరీ మరీ ప్రాధేయపడుతున్నాడు.

ఎదురుగా చూస్తున్నది నిజమేనా? చేత్తో డబ్బులిస్తేనే పుచ్చుకోని వీళ్ళు వెంకన్న చేతులు పట్టుకుని మాట్లాడుతుంటే నాకు ఆశ్చర్యం కలగవలసింది పోయి ఏదో అనుమానం వేసింది.

అలా ఆ వ్యక్తి ప్రాధేయ పడుతుంటే వెంకన్న మరింత ముడుచుకుపోతున్నాడు. అంతేకాదు వెంకన్న అతనికి నన్ను చూపెడుతూ ఏదో భరోసా కూడా ఇచ్చేస్తున్నాడు. అసలు విషయం తెలియక ఈ సస్పెన్సు తికమకపెడుతోంది.

అంతవరకు ప్రాధేయపడుతున్న ఆ అగ్రకులస్థు చివరికి ఏదో బెదిరిస్తూ అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

"నేననుకొన్నదంతా అయిందండీ దాసుగోరు" గేటు తలుపేసి లోపలికొస్తూ వెంకన్న జీరపోయిన గొంతుతో అన్నాడు.

"అసలేం జరిగిందో చెప్పండి" ఆత్రుత ఆణుచుకోలేక అడిగేశాను.

"పెద్ద ఇంజనీరు పదివి వుజ్జోగం చేసుకుంటున్నాడని సంబరపడిపోతుంటే మద్దెలో యిలా సేసాడు. అద్ని ఏం సేత్తారో మీరే సెయ్యాలి" తరతరాలుగా దెబ్బతీస్తున్న భయం వెంకన్న గొంతులో వుంది.

"యిందాకొచ్చాడు సూడండి ఆయనే బులిరాజు గోరు. ఆరమ్మాయినే మనోడు మనువాడతానంటూ కూర్చున్నాడు. ఆ ఇసయం నాకు నాలుగు రోజుల కిందే తెల్సింది" అని చెప్పి కొండంత బరువు దించుకున్నట్టు అరుగు మీద కూర్చుండిపోయాడు వెంకన్న.

"అమ్మాయి ఏం చదువుకొంది?" తృటిలో పెద్ద తుపాను తప్పిపోయిన రిలీఫ్‌తో అడిగాను.

"మా సిన్నమ్మయి తోటిదండి, సదువేదో పదవతరగతితోనే ఆపేశారు. ఎప్పుడూ మన ఇంట్లోనే వుండేది. మీరు సూసే వుంటారు" వెంకన్న మాటలలో ఆ అమ్మాయి మీద వాత్సల్యమే కనిపించింది.

"అయితే ఈ బులిరాజుగారేమంటారు?" కథ తర్వాత భాగం తెలుస్తుందని అడిగాను.

"పాపం బులిరాజుగోరు మంచోరేనండి. ఈ పెళ్ళైతే వూళ్ళో ఆయన ఎలా తలెత్తుకుంటాడు సెప్పండి. నా సేతులు గెడ్డం అట్టుకొని- ఒరే ఎంకడూ- సచ్చి నీ కడుపున పుడతాన్రా- ఈ పెళ్ళి ఆపేయ్యరా- అని సంటిపిల్లాడిలా ఏడిశాడండి బాబు" అలా అన్నప్పుడు వెంకన్న కళ్ళలో కూడా చెమ్మ కనిపించింది. వెంకన్న దేన్నయినా తట్టుకోగలడు కాని కృతజ్ఞత ప్రకటిస్తే తట్టుకోలేడు.

"ఆయన మీ దగ్గర కూలి చేయడానికి లేని అభ్యంతరం బిడ్డనిచ్చి పెళ్ళి చేయడానికొచ్చిందన్న మాట" నాలో పౌరుషం తన్నుకొచ్చింది. "అంతే కదా, రాజుని రానీ, ఆ తర్వాత మాట్లాడదాంలే" అని వెంకన్నని ఆపుచేశాను.

రాత్రి పడుకునే ముందు రాజు వచ్చాడు. "మీరు కాకినాడ వెడతారని చెప్పింది అక్క, ఇక్కడికెప్పుడొచ్చారు?" అని అభిమానంగా అడుగుతూ దగ్గర కూర్చోబోయాడు.

"ముందు భోజనం చేసిరా, నీతో మాట్లాడాలి" అని లోపలికి పంపి రాజు భోజనం చేసి వచ్చేసరికి నేనొక నిశ్చితాభిప్రాయానికి వచ్చేశాను.

(మిగతా పక్క పేజీలో)

అపెండిసైటిస్

కడుపు నొప్పికి అతి సాధారణ కారణాల్లో అపెండిసైటిస్ ఒకటి. శస్త్రచికిత్స చేసి కడుపునొప్పిని నివారించే సాధారణ కారణాల్లో కూడా ఇది ఒకటని చెప్పవచ్చు. ఈ వ్యాధి ఎప్పుడైనా, ఏ వయస్సులోనైనా రావచ్చు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణానికే హాని చేయగల వ్యాధి ఇది. 19వ శతాబ్దం వరకు ఈ వ్యాధి నిర్ధారణ చాలామంది వైద్యులకు తెలిసేది కాదు. దీనికి ప్రధాన కారణం మానవ నిర్మాణ శాస్త్రం (ANATOMY) గురించి సరియైన అవగాహన లేకపోవడమే. ఆధునిక వైద్య విజ్ఞాన అభివృద్ధి, సమర్థవంతమైన మత్తుమందులు, మంచి యాంటి బయాటిక్స్ ఈ వ్యాధిని చాలా తొలి దశలో కనుక్కోవడానికి తోడ్పడ్డాయి. వ్యాధి నివారణ సులభతరమైనది. ఒక శతాబ్దం క్రితం వరకు ఈ వ్యాధి వచ్చిన వారిలో ఎక్కువ మంది సరైన వైద్య సదుపాయం లేక చనిపోయేవారు.

1736వ సంవత్సరంలో అమియాన్డ్ అనే సర్జన్ తొలిసారిగా శస్త్ర చికిత్స చేసి అపెండిక్స్‌ని తొలగించాడు. ఇది యాదృశ్చికంగా జరిగింది. ఎందుకంటే పదకొండు ఏళ్ళ బాలుడికి హెర్నియా ఆపరేషన్ చేస్తుంటే అనుకోకుండా అపెండిక్స్ కూడా వ్యాధికి గురైందని గమనించి తీసివేయడం జరిగింది. అపెండిసైటిస్ వ్యాధిని ముందుగా నిర్ణయించి, ఆపరేషన్ చేసి చికిత్స చేసిన మొదటి వ్యక్తి రాబర్ట్ లాసన్. ఇతను ఈ ఆపరేషన్‌ను తొలిసారిగా 1880లో ఇంగ్లండులో చేశాడు. అప్పట్లో ఈ ఆపరేషన్ చేసిన తర్వాత కూడా 40 శాతం రోగులు చనిపోయేవారు. మంచి మందులు వుండడం,



అపెండిసైటిస్‌లో నొప్పి వుండే ప్రాంతం ఇదే

వ్యాధిని తొలి దశలో కనుక్కోవడం వలన 1940 నుంచి ఆపరేషన్ వలన చనిపోయేవారి శాతం తగ్గుతూ వచ్చింది. ఈ రోజుల్లో అపెండిసెక్టమీ ఆపరేషన్ వలన చనిపోయేవారు వుండరంటే అతిశయోక్తి కాదు. ఇంత సాధారణమైన వ్యాధిని గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఈ వ్యాధినే తెలుగులో "24 గంటల జబ్బు" అని పిలుస్తూ వుంటారు.

అపెండిసైటిస్ అంటే ఏమిటి?

మానవుని జీర్ణకోశంలో చిన్నపేగు, పెద్దపేగు అనే రెండు అవయవాలు వుంటాయి. ఈ రెండు పేగుల మధ్యన 3–4 అంగుళాలు బారుగల సన్నని పురుగు ఆకారంలో వుండే అవయవాన్ని అపెండిక్స్ అంటారు. ఈ అపెండిక్స్ చిత్రంగా మనిషి, ఇంకా కొన్ని రకాల కోతి జాతులలోనే వుంటుంది. మిగిలిన ప్రాణులలో ఈ అవయవం వుండదు. ఈ అపెండిక్స్‌లో హాని కలగజేసే బాక్టీరియా చేరడం వలన ఇన్ఫెక్షన్ వస్తే దానినే అపెండిసైటిస్ అంటారు.

ఎందుకు వస్తుంది?

అపెండిక్స్ ఒక పక్కన మూసివేయబడిన ఒక సన్నని ట్యూబు ఆకారములో వుంటుంది. గట్టిపడిన మలము, కూరగాయ ముక్కలు, పండ్లగింజలు, క్రిములు మొదలగునవి అపెండిక్స్ ద్వారానికి అడ్డుపడినప్పుడు అది మూసివేయబడుతుంది. అపెండిక్స్ లోపలి పొరల్లో ఒక పల్చటి ద్రవము ఉత్పత్తి అవుతుంది. అపెండిక్స్ మూసివేయబడడం వలన ఆ ద్రవము బయటికి రాక లోపలనే గూడు కట్టుతుంది. అప్పుడు అపెండిక్స్ వాస్తుంది. వాయడం వలన నరాలు ప్రేరణ చెంది రోగికి నొప్పి, వాంతులు ఆరంభమౌతాయి. ద్రవం నిల్వ వుండడం వలన బాక్టీరియా అధికంగా ఉత్పత్తి అయి, ఆ ద్రవం చీముగా మారుతుంది. చీము ఎక్కువ అయ్యే కొలది వత్తిడి వలన లోపలి పొరలు దెబ్బతిని రక్త ప్రసరణ ఆగిపోతుంది. రక్తప్రసరణ లేకపోవడం వలన అపెండిక్స్ జీవం కోల్పోతుంది. ఇంకా ఆలస్యమైతే అపెండిక్స్ పొరలు పల్చబడి బలహీనంగా వున్నచోట పగిలి ప్రాణానికే ప్రమాదం జరుగుతుంది. ఎందుకంటే పగిలిన పేగులోని చీము పొత్తికడుపు మొత్తం వ్యాపించి పెరిటొనైటిస్ (PERITONITIS) అనే అతి ప్రమాదమైన స్థితికి దారి తీస్తుంది.

రోగి లక్షణాలు

20–30 సంవత్సరాలు మధ్య వయస్సులో ఎక్కువగా ఈ వ్యాధి వస్తుంది. ఏ వయస్సు లోనైనా వచ్చే అవకాశం వున్నా చిన్నపిల్లల్లో, వృద్ధాప్యంలో తక్కువగా వస్తుంది. కడుపు నొప్పి అన్నిటికన్నా ప్రధాన లక్షణం. సాధారణంగా తెల్లవారుజామున నొప్పి ప్రారంభమై రోగి నిద్ర లేస్తాడు. మొదట నొప్పి బొడ్డు చుట్టూ వస్తుంది. 4–6 గంటల తర్వాత నొప్పి అపెండిక్స్ వుండే ప్రాంతం దగ్గర కేంద్రీకృతమౌతుంది. అంటే పొత్తికడుపు కుడి పక్క, కింది భాగాన నొప్పి వుంటుంది. నొప్పి ఆరంభమైన తర్వాత వాంతులూ, కొంచెం జ్వరమూ వస్తాయి. రోగికి ఆకలి తగ్గిపోతుంది. రోగి కదలడం వలన లోపల వున్న అపెండిక్స్ కూడా కదిలి నొప్పి వస్తుంది. అందుకనే రోగి కదలకుండా కాళ్ళు ముడుచుకొని పడుకుంటాడు. అపెండిసైటిస్ వ్యాధిని ఎంత తొలి దశలో కనుక్కుంటే రోగికి అంత మంచిది. అయితే నొప్పి లేకుండా అపెండిసైటిస్ వ్యాధి నిర్ధారణ చేయకూడదు.

అపెండిసైటిస్ వ్యాధి చిన్న వయస్సులో లేక వృద్ధాప్యంలో వస్తే రోగ నిర్ధారణ కొంచెం కష్టం. అంతేకాకుండా వీరిలో ఈ వ్యాధి ఎక్కువ ప్రాణ నష్టాన్ని కలిగిస్తుంది. గర్భిణీ స్త్రీలలో కూడా ఈ వ్యాధి వలన ప్రమాదం ఎక్కువ. వీరిలో పెరిగే శిశువు వలన అపెండిక్స్ పైకి నెట్టివేయబడుతుంది. కనుక నొప్పి వుండవలసిన ప్రదేశము కన్నా కొంచెం పైన వుండడం వలన వ్యాధి నిర్ధారణ కష్టం. అంతేకాకుండా గర్భిణీ స్త్రీలలో అపెండిసైటిస్ వస్తే అబార్షన్ లేక ముందుగా కాన్పు అయ్యే అవకాశాలు ఎక్కువ.

పరీక్షలు

పరీక్షల కన్నా రోగి లక్షణాలపై ఆధారపడే ఈ వ్యాధిని కనుగొనడం తేలిక. ఏ ఒక్క పరీక్ష వలనా ఈ వ్యాధిని ఖచ్చితంగా నిర్ణయించలేము. రక్త పరీక్షలో తెల్లకణాల సంఖ్య (T.W.B.C.) పెరుగుతుంది. పొత్తికడుపు ఎక్సరేలో కొన్ని ముఖ్యమైన లక్షణాల వల్ల వ్యాధి నిర్ధారణ చేయవచ్చు. మూత్రం, ఇ.సి.జి., స్కానింగ్ మొదలగునవి వ్యాధి నిర్ధారణకు ఉపయోగపడే కన్నా రోగి సాధారణ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుపుతాయి.

వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే కలిగే దుష్ఫలితాలు

అపెండిసైటిస్ వ్యాధి ఆరంభమైన తర్వాత అశ్రద్ధచేస్తే చిక్కుల్లో పడడం తథ్యం. చాలా కొద్ది మందిలో అపెండిసైటిస్ ఏ యిబ్బంది కలగజేయకుండా మానిపోయే అవకాశం వుంది. దీనినే స్పాంటేనియస్ రిజల్యూషన్ (SPONTANEOUS RESOLUTION)



అంటారు. వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే సాధారణంగా రోగి రెండు ముఖ్యమైన ఇబ్బందులలో చిక్కు కుంటాడు. అవి:

1. అపెండిక్స్ కుళ్ళిపోయి పగిలిపోవడం (GANGRENE AND PERFORATION):

పైన పేర్కొన్న విధంగా అపెండిక్స్ పేగు ద్వారానికి అడ్డుపడినప్పుడు లోపల చీము జేరి పేగు వుబ్బుతుంది. ఆలస్యమైతే ఒక దశలో పేగు పగులుతుంది. పగిలిన పేగులో నుంచి చీము బయటకు చింది పక్కన వున్న అవయవాలకు పాకుతుంది. వ్యాధి ఆరంభానికి చీము పట్టి పగలడానికి మధ్య చాలా గంటల సమయం వుంటుంది. ఈ సమయంలో ప్రకృతి సహజంగా అపెండిక్స్ పక్కన వున్న పేగులన్నీ దాని చుట్టూ చేరి ఒక వలయాకారంగా ఏర్పడి వ్యాధిని దూరం పాకకుండా కాపాడతాయి. ఒకవేళ ఇది జరగని పక్షంలో వ్యాధి తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. కొన్ని సందర్భాలలో రోగి ప్రాణం కోల్పోయే ప్రమాదం వుంది.

2. అపెండిక్స్ గడ్డ ఏర్పడటం (APPENDIX MASS):

పేగు పగలని పక్షంలో లేదా పేగు పగిలి చీము దూర ప్రాంతానికి పాకకుండా వున్నప్పుడు చుట్టూ వున్న అవయవాలు అపెండిక్స్‌కు అంటుకొని ఒక గడ్డలాగా ఏర్పడుతుంది. ఇది ప్రకృతి సహజమైన పరిణామం. దీని వలన వ్యాధి పాకకుండా వుంటుంది. ఈ గడ్డ కొద్ది రోజుల్లో సహజంగా లేక మందుల వలన కరిగిపోవచ్చు. రోగి ఆరోగ్య స్థితిగతులపై ఇది ఆధారపడి వుంటుంది. గడ్డ కరగని దశలో అశ్రద్ధచేసినా ఆ గడ్డలో చీము చేరి ప్రాణాపాయం



అపెండిక్స్‌కు చీము పట్టి పగిలే ముందు దృశ్యం

కావచ్చు. అపెండిక్స్ గడ్డ సాధారణంగా వ్యాధి ఆరంభమైన మూడవ రోజు ఏర్పడుతుంది. అయిదు లేక ఆరవ రోజుకి చీము గడ్డగా మారుతుంది.

చిన్నపిల్లల్లో, వృద్ధులలో పైన తెలిపిన రెండు దుష్ఫలితాలు తొందరగా ఏర్పడే అవకాశాలు ఎక్కువ.

చికిత్సా విధానము

ఒక్క మాటలో చెప్పాలంటే అపెండిసైటిస్ వ్యాధికి చికిత్స ఆపరేషన్ ఒక్కటే. వ్యాధికి గురైన అపెండిక్స్‌ని శస్త్రచికిత్స ద్వారా తీసివేయడాన్ని అపెండిసెక్టమీ అంటారు (APPENDICECTOMY). వ్యాధిని త్వరగా గుర్తించి ఎంత త్వరగా ఆపరేషన్ చేస్తే అంత మంచిది.

అపెండిసెక్టమి ఆపరేషన్ చాలా తేలికైన, సులువుగా చేయబడే ఆపరేషన్. రెండు లేక మూడు కుట్లుతో అయిపోయే ఆపరేషన్. రోగి వయస్సును బట్టి, ఆరోగ్య పరిస్థితిని బట్టి జనరల్ ఎనస్థీషియా అని పిలవబడే పెద్ద మత్తు లేక స్పైనల్ ఎనస్థీషియా అని పిలవబడే నడుముకి యిచ్చే మత్తు ద్వారా ఆపరేషన్ చేయవచ్చు. అపెండిక్స్ వుండే ప్రదేశం అంటే బొడ్డుకి కింద కుడి ప్రక్కన ఈ ఆపరేషన్ చేస్తారు. ఆపరేషన్ ప్రక్రియ మొత్తం 20–30 నిముషాల్లో అయిపోతుంది. ఆపరేషన్ చేసిన కొద్ది గంటల తర్వాత నుంచి రోగి లేచి తిరగవచ్చు. తేలికైన ఆహారం తీసుకోవచ్చు. రోగి పరిస్థితిని బట్టి మరుసటి రోజు లేక కుట్లు తీసిన ఏడవ రోజు యింటికి వెళ్ళవచ్చు. ఈ ఆపరేషన్ వలన ఎటువంటి ఇబ్బందులూ రావు.

కొన్ని సందర్భాలలో రోగి వ్యాధి తెలుసుకోలేకపోవడం వలనగాని, అశ్రద్ధ చేయడం వలనగాని, డాక్టర్ని సంప్రదించేసరికి వ్యాధి మొదలై రెండు, మూడు రోజులు గడవ వచ్చు. అప్పుడు అపెండిక్స్ ఒక గడ్డగా ఏర్పడుతుంది. అట్టి పరిస్థితులలో తొందరపడి ఆపరేషన్ చేయడం కన్నా మందులు వాడి వ్యాధిని నయం చేయడం మంచిది. దీనినే CONSERVATIVE TREATMENT అంటారు.

కొన్నిసార్లు అపెండిక్స్ గడ్డ మందుల వలన కరగకపోవచ్చు. రోగికి జ్వరం కూడా వస్తుంది. దీని అర్థం ఏమంటే ఆ గడ్డలో చీము ఏర్పడినది అని. ఒకసారి చీము ఏర్పడిన తర్వాత తప్పనిసరిగా ఆపరేషన్ చేసి చీమును తీసేయాలి. ఇది కూడా ఒక చిన్న ఆపరేషన్ వంటిదే. దీని వలన రోగికి ఎటువంటి ఇబ్బంది వుండదు. చీమును తీసివేసిన తర్వాత రోగికి జ్వరం, నొప్పి తగ్గిపోతాయి.

పైన తెలిపినట్టు చీమును మాత్రమే తీసేసినప్పుడుగాని, ఆపరేషన్ లేకుండా మందుల ద్వారా వ్యాధి తగ్గిన సందర్భాలలోగాని మరలా అపెండిసైటిస్ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. దీనిని నివారించడానికి వ్యాధి వచ్చిన ఆరు వారాల తర్వాత రోగి ఆరోగ్యంగా వున్నప్పుడు అపెండిసెక్టమి ఆపరేషన్ చేయడం మంచిది. దీనినే ఇంటర్వెల్ అపెండిసెక్టమి అంటారు.

— డా. కె.వరప్రసాద్
ఎం.ఎస్.,
లక్ష్మీ నర్సింగ్ హోమ్,
కొత్తపేట, గుంటూరు–522 001

ఈ వారం కథ

(పక్కపేజీ తరువాయి)

'రాజు నువ్వేమనుకోవంటే విన్నొకటి అడుగుతాను. రాధ నీకు నిజంగా నచ్చిందా? లేక గొప్పకులంలో పుట్టిన బిడ్డ కదా అని మోజు పడ్డావా?" ఆ ప్రశ్న కటువయిందని తెలుసు. అయినా నాలో రగులుతున్న కసి అలా అడిగించింది.

"మీరడిగిన కోణం నుంచి నేనెప్పుడూ ఆలోచించలేదుసార్" ప్రశ్నకు దెబ్బతిన్నా నిజాయితీగా చెప్పేడు రాజు.

"రేపు అమ్మాయితో మాట్లాడటానికి వీలవుతుందా? అటు విషయాలు కూడా తెల్సుకోవాలి కదా?"

"అదేమిటి సార్. ఇప్పుడు రమ్మంటే ఇప్పుడు వస్తుంది. ఆమెది నిజమైన ప్రేమ. నా గురించి అంటారా మీరన్న కోణం నుంచి మరోసారి ఆలోచించాలి" తమ ప్రేమ స్వచ్ఛంగా వుందా లేదా అన్నది తను కూడా తెల్సుకోవాలన్నట్టుంది రాజు స్వరం.

రెండవరోజు ఉదయం పది గంటలయ్యేసరికే రెండుసార్లు రాధ ఇంటికి వెళ్ళివచ్చాడు రాజు. రాధ తండ్రి ఆ రోజు కూలికెళ్ళలేదు. తండ్రి ఇంట్లో వుండగా ఆ రోజు రాజుతో రావడానికి వీలుపడలేదు.

"ఎన్ని కబుర్లెట్టినా రాధమ్మ ఎందుకు రాలేదో" మనస్సులో గొణుక్కున్నట్టు అన్నాడు వెంకన్న. "జరిగిదేదో జరుగుద్ది అన్నాలకి లేవండి" అని ఆయన అనేవరకు ఎవరికీ భోజనాలు చేయలేదన్న స్పృహే లేదు.

సాయంత్రం అయింది. పాలేళ్ళు పశువులను చెరువులో కడిగి వెంకన్న ఇంటికి తోలుకొచ్చేరు. అగ్రవర్ణ కూలీలు కూడా అదే వేళకు వెంకన్న ఇంటికొచ్చి ఎప్పటిలానే కూలి డబ్బులు నేల మీద పెట్టించుకుని వాటిని అందుకుని వెళ్ళిపోయారు. సంవత్సరాల ఆ సంస్కృతిలో మార్పు లేదు.

"కాస్త చీకటి పడిన తరువాత వస్తుందేమో..." ఇంకా తనలో ఆశ చావక రాజు అన్నాడు.

చీకటి పడింది. అప్పుడు రాధ రాలేదు గాని ఓ చిన్న కుర్రాడు వచ్చేడు. రాధ ఇచ్చిన చీటీ రాజు చేతిలో వుంచి వెళ్ళిపోయాడు.

రాధ ఎందుకు రాలేదు?! ఉత్తరం చదివి రాజు హతాసుడైపోయాడు. నేనూహించిందే జరిగి వుంటుందని అనుకొన్నాను.

రాజు గొంతు పెగుల్చుకుని "రండి మాస్టారు, మిమ్మల్ని బస్సు ఎక్కిస్తాను" అన్నాడు. నేను వెంకన్నతో వస్తానని చెప్పి బయల్దేరాను.

కాలువ గట్టుకు చేరాం. బస్సు ఆగేచోట ఆ గట్టు మీద నిలుచున్నాం. మా ఇద్దరి మధ్య చాలాసేపు మౌనం తాండవించింది. కాలవ నిండుగా పొర్లి ప్రవహిస్తుంది. ఏ క్షణాన్నయినా రోడ్డు మీదకు పొర్లుకొచ్చేలా వుంది. రాజు గుండెల్లో కూడా ఆవేదన అంత తీవ్రంగానూ కన్నీరై తన్నుకొచ్చేలాగుంది.

"చూడండి సార్ ఈ ఉత్తరం! ఆమెను మర్చిపోయి ఇంకొకరిని ఎవరినైనా చేసుకోవాలట..." ఉత్తరంలోని విషయం చివరికి బయటపెట్టాడు. తన ప్రేమ సౌధం కళ్ళం ముందే కూలిపోతే తట్టుకోలేక కుమిలిపోతున్న రాజును చూసి కొంతసేపు నిర్లిప్తంగా వుండిపోయాను.

విభజించి పాలించడం ఆంగ్లేయులకు వెన్నతో పెట్టిన విద్య అని మన చరిత్రకారులు మన చిన్న నాటి నుంచి నూరిపోస్తారు. కాని కొన్ని వేల సంవత్సరాల నుండే విభజించి, అణగద్రొక్కటంలో తెల్లవాడిని తలదన్నిన ఈ దేశంలో అంటరాని సంస్కృతిని గూర్చి ఎక్కడా చెప్పరు. నేనురాజు కేసి తిరిగాను.

రాజు భూదిగంతాల కేసి, పొర్లి ప్రవహించే నీళ్ళ కేసి గొంతారని గుండెతో చూస్తున్నాడు.

"చూడు రాజూ! ఆ అమ్మాయి తండ్రి నీ తండ్రి దగ్గర వ్యవసాయ కూలీ. ఆ అమ్మాయి మీ ఇంట్లోనే పెరిగింది. మీ ఇద్దరూ ఒకే కంచంలో భోంచేసి వుండవచ్చు. మీ ఇద్దరి మధ్య నిజానికి కాకి ఎంగిలి కూడా లేకపోవచ్చు. కాని పెళ్ళి దగ్గర కొచ్చేసరికి ఏమీ లేనిదయినా ఆమె రాచబిడ్డ. నీవు అన్నీ వుండి కూడా పంచముడివి. ఆమె నిన్ను స్వచ్ఛంగానే ప్రేమించి వుంటుంది. కానీ ఇప్పుడున్న సమాజం నిన్ను తాకనంటుంది... కర్మ, తలరాత అనే మత్తుమందుల్తో పుట్టక ముందే ముఖాలపై అంటరాని వాళ్ళనే పచ్చబొట్టు పొడిచే ఈ వ్యవస్థపై మొదట చేయాల్సింది వర్ణపోరాటం అని నేనే వాడో గ్రహించాను" అన్నాను.

చీకటిని చీల్చుకుంటూ, జవాన్ని మోసుకొస్తున్న మా ఊరి బస్సు మా ముందుకు వచ్చి నిలిచింది.

నేను బస్ ఎక్కుతూ రాజు ముఖంలోకి చూశాను. గాంభీర్యాన్ని సంతరించుకొన్న ముఖాన్ని చూస్తూ వీడ్కోలు చెప్పేను.

రాజుకు నేను ఏ సలహా ఇవ్వకుండానే బస్ ఎక్కాననే దిగులు నాకు లేదు. అతడు విద్యావంతుడు. జరిగిన సంఘటన చాలు, తన జీవితం ఒక్కటీ తీర్చిదిద్దుకున్నంత మాత్రాన ఈ వ్యవస్థ మారదని అతనికి అర్థం కావటానికి.